## క్లుప్తంగా

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



టెక్కలి: పూజలు చేస్తున్న భక్తులు

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని ఉమారామలింగేశ్వర స్వామి వారి దేవాలయ 14వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కాశీ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరుల కల్యాణం, మహారుద్రాభిషేకం నిర్వహించి హోమం కాల్చారు. అధికసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

### సీతారాముల విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో చైర్‌పర్సన్ విజయ తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని టి.బరంపురం గ్రామంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యా హవచనం, పరిషత్, పంచగవ్యప్రాసన, రక్ష సూత్రధారణ కార్యక్రమాలను వేద పండితులు మంత్రి ప్రగడ ఫణీంద్రశర్మ నిర్వహించారు. స్వామివారిని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ కారంగి త్రినాథ్, వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, తిప్పన ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

### అడవి పందుల స్వైర విహారం



బెండి వద్ద రాత్రివేళలో రోడ్డు దాటుతున్న అడవి పందులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు, బెండి గేట్ పరిసర ప్రాంతాలలో అడవిపందులు రాత్రి వేళల్లో స్వైర విహారం చేస్తున్నాయి. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను నాశనం చేస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడుకొనేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అడవి పందులు గుంపులుగా రోడ్లపై కూడా సంచరిస్తుండడంతో పలువురు వాహనదారులు వాటినుంచి తప్పించుకునే క్రమంలో అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

### సేంద్రీయ సాగు కూరగాయలు విక్రయం



సేంద్రీయ సాగు కూరగాయలను అందజేస్తున్న దృశ్యం

కంచిలి: సేంద్రీయ పద్ధతిలో సాగుచేసిన కూరగాయలను వినియోగించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతామని ప్రకృతి వ్యవసాయ విధానం మండల యాంకర్ టి.శివానందం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట కూరగాయల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేయగా పలువురు వినియోగదారులు వీటిని కొనుగోలు చేశారు. వారికి ఇందులో ఉండే పోషక విలువలు గురించి వివరించారు. పలువురు సిబ్బంది ఉన్నారు.

### వైభవంగా కల్యాణ మహోత్సవం



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తదితరులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వ వార్డు రోటరీనగర్‌లో భద్రావతిదేవి, భావనారుషి వారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీమార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ, నియోజకవర్గ నాయకులు, భక్తులు భారీగా పాల్గొని పూజలు చేశారు.

### నేడు కిష్టుపురంలో ఉచిత వైద్య శిబిరం

కాశీబుగ్గ: పలాస మండలం కిష్టుపురంలో మంగళవారం ఉదయం ఉచిత వైద్య శిబిరాన్ని గ్లో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సంబంధిత ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



### పోలీసుల తనిఖీలు

గంజాయి అమ్మకాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకునార్కోటిక్ డాగ్‌స్క్వాడ్ తనిఖీలు కవిటిలో సోమవారం చేపట్టామని స్థానిక ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ డాగ్‌స్క్వాడ్ టీం, కవిటి పోలీసు సిబ్బంది సంయుక్తంగా పట్టణంలోని అనుమానిత ప్రదేశాలు, మార్కెట్, పాన్‌షాపులు, హోటళ్లల్లో ఈ మేరకు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా ప్రయాణం చేస్తున్న వాహనదారులకు అవగాహన కల్పించారు.

-కవిటి



### నేత్ర వైద్య శిబిరం

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో పలాసలోని సత్యసాయి మందిరంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 79 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. వీరిలో 55 మందికి శస్త్రచికిత్సల కోసం ప్రత్యేక బస్సులో ఆస్పత్రికి తరలించారు. నేత్ర వైద్య నిపుణులు సురేష్, క్యాంప్ కో-ఆర్డినేటర్ సాయి, కన్వీనర్ జగదీష్, పెద్దలు జేసీఎస్ శ్రీనివాసరావు, కొంతేయుడు, కృష్ణస్వామి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

-కాశీబుగ్గ



### బాల కార్మికులుంటే చర్యలు

దుకాణాలు, హోటళ్లలో బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టెక్కలి లేబర్ అధికారి రాధాకుమారి అన్నారు. మండల కేంద్రం సంతబొమ్మాళిలోని దుకాణాలు, హోటళ్లు, డాబా, మెడికల్ షాపుల్లో సోమవారం తనిఖీలు చేపట్టారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూళనకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. బాలలందరూ పాఠశాలలకు వెళ్లి చదువుకునేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి ఏఎస్ఐ సుందరరావు, ఏఎల్‌సీ కోఆర్డినేటర్ పూడి జనార్దనరావు, చైల్డ్ లైన్ పర్సన్ మౌనిక ఉన్నారు.

-సంతబొమ్మాళి



### ఆక్రమణలు తొలగించాలి

సోంపేట మండలం బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆక్రమణలు తొలగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయ అధికారులకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన స్థలాన్ని కొంతమంది చాలా ఏళ్ల క్రితం ఆక్రమించుకున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకొని సంబంధిత స్థలాన్ని తిరిగి కళాశాలకు అప్పగించాలని కోరారు. విద్యార్థులు రాజేశ్వరి, యాత్రి, శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

- సోంపేట

# బర్డ్‌ఫ్లూపై భయం వద్దు!

- కోళ్లఫారం షెడ్లు పరిశుభ్రంగా ఉంచాలి: పశువైద్యశాఖ



సంతబొమ్మాళి మండలంలో బ్రాయిలర్ కోళ్ల ఫారాన్ని పరిశీలించి బర్డ్‌ఫ్లూ జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న పశు వైద్య సిబ్బంది

టెక్కలి: బర్డ్‌ఫ్లూ భయం చికెన్ ప్రియులను వణికిస్తోంది. దీంతో చికెన్, కోడిగుడ్లు తినేందుకు జనం జంకుతున్నారు. ఫలితంగా చికెన్ విక్రయ దుకాణాలు, ఎగ్ సెంటర్లలో కొనుగోళ్లు ఘననీయంగా తగ్గిపోవడంతో ఆయా యజమానులు నష్టానికి గురవుతున్నారు. రెస్టారెంట్‌లలో సైతం చికెన్‌తో చేసిన ఆహార పదార్థాల వినియోగం తగ్గుముఖం పట్టింది. అయితే మన ప్రాంతంలో ఎటువంటి బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదని.. వీటి వినియోగం విషయంలో ఆందోళన వద్దని పశు వైద్య సిబ్బంది సూచిస్తున్నారు.

**షెడ్లను పరిశుభ్రంగా ఉంచాలి**

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రబలిన నేపథ్యంలో పశువైద్యశాఖ సిబ్బంది కోళ్ల ఫారాల యాజమానులకు పలు సూచనలు చేస్తున్నారు. కోళ్లను ఉంచే షెడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, పరిసరాలను రోజూ శానిటేషన్ చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. అలాగే చికెన్, కోడి గుడ్లను శుభ్రంగా ఉడికిన తరువాత తినాలని చెబుతున్నారు. కోళ్ల ఫారం, చికెన్ సెంటర్లలో పరిశుభ్రత చర్యలు పాటిస్తే ఎటువంటి ప్రమాదం ఉండదని పేర్కొంటున్నారు.



టెక్కలి మండలంలో నాటు కోళ్ల ఫారం

**టెక్కలి నియోజకవర్గంలో కోళ్ల సంఖ్య ఇలా..**

- టెక్కలి మండలంలో అధికారుల లెక్కల ప్రకారం మూడు కోళ్ల ఫారాలలో సుమారు 17 వేల వరకు బ్రాయిలర్ కోళ్లు ఉన్నాయి. అలాగే మండలంలో 20 వేలకు పైగా నాటు కోళ్లు ఉన్నాయి. నందిగాం మండలంలో ఎనిమిది కోళ్ల ఫారాల్లో 25 వేల వరకు బ్రాయిలర్ కోళ్లు, 50 వేల వరకు నాటు కోళ్లు,
- సంతబొమ్మాళి మండలంలోని ఐదు ఫారాల్లో 22 వేల వరకు బ్రాయిలర్, 40 వేల వరకు నాటు,
- కోటబొమ్మాళి మండలంలోని రెండు ఫారాల్లో 15 వేల వరకు బ్రాయిలర్, 24 వేల వరకు నాటు కోళ్లు ఉన్నాయి.

**ఎటువంటి భయాందోళన వద్దు**



చికెన్, కోడిగుడ్ల వినియోగంలో ఎటువంటి భయాందోళన అవసరం లేదు. మన ప్రాంతంలో ఎటువంటి బర్డ్‌ఫ్లూ లేదు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎక్కడైనా కోళ్లు మరణిస్తే ఆందోళన చెందకుండా పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలి. కోళ్ల ఫారాలను పరిశీలించి జాగ్రత్తలపై అవగాహన కల్పించాం. ఎక్కడైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే తక్షణమే పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలి.

-జి.రఘునాథరావు, ఏడీ, పశు వైద్యశాఖ, టెక్కలి

## 'సంస్కరణలతో ప్రభుత్వ బడులకు నష్టం'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరీ

కంచిలి: విద్యా రంగంలో రానున్న సంస్కరణలతో ప్రభుత్వ బడులకు నష్టం కలిగే ప్రమాదం ఉందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీ అన్నారు. విద్యార్థులు చదువుకునే భాషను ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ లేకుండా ఉండాలంటే సమాంతర మీడియాన్ని కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. కంచిలి మండలంలో సోమవారం పర్యటించిన ఆమె పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను కలిసి తనకు మద్దతు తెలియజేయాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యా రంగంలో ప్రస్తుతం జరుగుతున్న సంస్కరణలతో అయోమయ పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రచారంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, మండల ప్రధాన కార్యదర్శి నల్లాన రవి, మండల కోశాధికారి టొంపల త్రినాథ్ ఉన్నారు.

## 'స్కూల్ బస్సులపై పర్యవేక్షణ లేదు'



ఎంఈవో లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

కాశీబుగ్గ: స్కూల్ బస్సుల పనితీరుపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రవికుమార్ ఆరోపించారు. మందస మండలంలో ఇటీవల 30 మంది పిల్లలతో వెళ్తున్న వివేకానంద పాఠశాలకు చెందిన బస్సు చెరువులో పడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలను సోమవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్సుల ఫిట్‌నెస్‌తో పాటు డ్రైవర్ల మానసిక స్థితిగతులు సక్రమంగా ఉందో..లేదో విద్యాశాఖ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఎంఈవో లక్ష్మణరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి హరిప్రసాద్, సాయికుమార్ ఉన్నారు.

## ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

కంచిలి: స్వయంశక్తి సంఘాలకు ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరిగా ఉండాలని స్థానిక ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్, ఆర్థిక క్రమశిక్షణ, మానవ వనరుల వినియోగం, సంస్థల బలోపేతం తదితర అంశాలపై శిక్షణ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధిహామీ పథకం ఏపీవో ధనుంజయ మాట్లాడుతూ.. వర్మీ కంపోస్టు, కిచెన్ గార్డెన్స్ తయారీలపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ టి.శివానందం పెరటి తోటల పెంపకం, నవధాన్యాలు, తేనెటీగల పెంపకం, కొబ్బరి బీమా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.లలిత, పలువురు సభ్యులు, వీవోఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## భూ సమస్య పరిష్కరించాలని వృద్ధ దంపతులు విజ్ఞప్తి



సమస్యను చెప్పుకుంటున్న వృద్ధ దంపతులు

సంతబొమ్మాళి: తమకు చెందిన భూ సమస్య పరిష్కరించాలని వృద్ధ దంపతులు వేడుకుంటున్నారు. గ్రామ స్థాయిలో పరిష్కారానికి నోటుకోకపోవడంతో మండల, జిల్లా కార్యాలయాలకు చేరుకొని ప్రతి సోమవారం ప్రభుత్వం నిర్వహించే స్పందన కార్యక్రమాల్లో అర్జీలు అందజేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చిన్నతుంగాం గ్రామానికి చెందిన సేనాపతి చక్రధరరావు, రాజేశ్వరి దంపతులు తమ భూమి తమకు ఇప్పించాలంటూ కోరేందుకు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి తమ భూమి కోసం ప్రభుత్వ కార్యాలయాలు, వీఆర్వోల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు చెందిన ఖాతా నంబర్ 282, సర్వే నంబర్ 55-1లో 0.63 సెంట్లు, 60-14లో 0-12 సెంట్లు మొత్తం 75 సెంట్లు భూమి ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డులలో 0.30 సెంట్లు భూమి మాత్రమే చూపిస్తున్నారని వివరించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరించడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆర్ఐ ప్రసన్నకు వినతిపత్రం అందజేశారు.

## సమన్వయంతో రైతుల గుర్తింపు సంఖ్య నమోదు



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరావు

ఇచ్ఛాపురం రూరల్: రైతులకు ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేసే సమయంలో వ్యవసాయశాఖ సిబ్బందితో పాటు వీఆర్వోలు సమన్వయం చేసుకొని ప్రక్రియ పూర్తి చేయాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక మండల వ్యవసాయాధికారి టి.భార్గవితో కలసి తన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. 11 నంబర్ల గల సంఖ్య ఫార్మర్ ఐడీ చేయించుకోవడం ద్వారా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీపై విత్తనాలు, క్రాప్ ఇన్సూరెన్స్, బ్యాంకు ద్వారా పంట రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మ సేద్య పరికరాల కోసం ఉపయోగపడుతోందన్నారు. రైతులు తమ ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఫోన్ నంబర్‌తో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.

## ఖాళీ స్థలాల గుర్తింపునకు చర్యలు

- పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ రామారావు



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఖాళీ స్థలాలను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ చేసి పరిశుభ్రంగా ఉంచడం.. వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే విషయమై చర్చించేందుకు సోమవారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అడ్మిన్ శానిటేషన్, ఎమినిటీస్, ప్లానింగ్ సెక్రటరీలకు పలు చేశారు. పురపాలక సంఘంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించి మూడు రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ చేసి సంబంధిత స్థల యజమానులు పన్నును చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. పన్ను చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. ఖాళీ స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆయా స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్టు కమిషనర్ స్పష్టం చేశారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సమయ పాలన పాటించని ఉద్యోగులు!



ఖాళీగా ఉన్న ఎంపీడీవో గది

సంతబొమ్మాళి:

స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కార్యాలయానికి ఎప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొనడంతో పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం 11 గంటల సమయం వరకు కేవలం ఏవో కుమార్ పట్నాయక్ మినహా ఇతర సిబ్బంది విధులకు హాజరు కాలేదు. ఎంపీడీవో జయంత్ ప్రసాద్, పంచాయతీ విస్తరణాధికారి పద్మజ, సినియర్ అసిస్టెంట్ డి.నర్సింగరావుతో సహా అటెండర్ కూడా విధులకు హాజరు కాలేదు. 10.40 గంటలకు ఓ అటెండర్ విధులకు వచ్చారు. ఎంపీడీవో జయంత్ ప్రసాద్ కాపుగోదాయవలస వైద్య శిబిరానికి వెళ్లారని కార్యాలయ సిబ్బంది తెలిపారు. దీనిపై కాపుగోదాయవలస పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్‌ను ఫోన్‌లో ప్రశ్నించగా ఎంపీడీవో ఇక్కడకు రాలేదని చెప్పడం గమనార్హం. అయితే గంట తర్వాత వైద్య శిబిరంలో పాల్గొన్నట్లు, పారిశుద్ధ్య పనులు చేస్తున్నట్లు పలు వాట్సాప్ గ్రూపుల్లో ఫొటోలు పంపారు. సిబ్బంది సకాలంలో కార్యాలయానికి చేరకపోవడానికి దూరప్రాంతాల నుంచి రాకపోకలు చేయడమే కారణం.

## కృష్ణారెడ్డి మృతికి సంతాపం



కృష్ణారెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రంగాల కృష్ణారెడ్డి అంత్యక్రియలు సోమవారం స్వగ్రామం అరకబద్రలో నిర్వహించారు. ఆయన భౌతికకాయానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు పిలక సంతులు నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు.



కృష్ణారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

**పరామర్శ**

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీ ఒకటో వార్డుకు చెందిన కొణతాల ఉషారాణి విశాఖలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం పరామర్శించారు. మృతురాలి తండ్రి సారథితో ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పిలక సంతు ఉన్నారు.

# కదంతొక్కిన అంగన్‌వాడీలు

- హామీలు అమలు చేయాలని నిరసన



సోంపేట: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

టెక్కలి: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం కదంతొక్కారు. సీఐటీయూ ఆధ్వర్యంలో టెక్కలి, కోటబొమ్మాళి మండలాల్లోని ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట ధర్నా చేసి నిరసన తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.26 వేలు కనీస వేతనం అందించాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ జీవో విడుదల చేయాలని, ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు అమలు చేయాలని, సర్వీసులో ఉంటూ చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి, కోటబొమ్మాళి మండలాల అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.సుధ, రమణమ్మ, ఆదిలక్ష్మి, దమయంతి, కృష్ణవేణి, ఎస్.సింహాద్రి ఉన్నారు.



టెక్కలిలో ఐసీడీఎస్ పీవో శోభారాణికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సోంపేట: హామీలు నెరవేర్చాలనే డిమాండ్‌తో సోంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, కార్యకర్తలు హేమలత, తేజోవతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.